# మంత్రికొడుకు

ఆ వస్తున్న పెద్దమనిషిపేరు శ్యామసుందరం. అతడు, నేను కొంతకాలం క్రితం యూనివర్శిటీ కాంపస్‌లో స్క్వాడ్ డ్యూటీ చేశాం. అప్పుడు ఓ మంత్రి కొడుకు మహాజోరుగా యూనివర్శిటీ కాంపస్ కళాశాలలను ఏలుతున్న రోజులు. రాక్షసులు మునులను గడగడలాడించినట్లు వాడు ప్రిన్సిపాల్‌ను, లెక్చరర్లను హడలగొట్టేవాడు.

సీసాలు, సిగరెట్లు మాముందే తాగేవాడు. తాగితే తాగాడు మా సొమ్మేం పోయింది అని ఊరుకునేవాళ్ళం లెక్చరర్లమంతా. కాని నిజానికి ఆ సొమ్మెవరిది? మంత్రిగారయిన వాడి అబ్బ ఇచ్చింది. మంత్రిగారికి ఆ సొమ్ము ఎక్కడిన్నుంచి వచ్చింది? అది ప్రజల సొమ్మేకదా? అంటే మన సొమ్మే అయినా ఊరుకునే వాళ్ళం. చెప్పానుగా మునులకంటే బలహీనులమై పోయాం. మునులను దేవుడు ఏదో అవతారంలో వచ్చి కాపాడుతాడనే నమ్మకం ఉండేది కాని మాకు ఆ నమ్మకం ఎక్కడిది. మంత్రికొడుకు కాలేజీలో అడుగుపెట్టాడంటే గజగజ వణికిపోయేవాళ్ళం. వాడు కాలేజీకి వచ్చేది చదువుకోసమా, అబ్బేకాదు. మమ్మల్ని కాల్చుకుతినడానికి అమ్మాయిలను బలాత్కరించడానికి. అడ్డుకునే యువకిశోరం ఏదయినా తగిలితే మంత్రికొడుకు తన గూండాబలగంతో ఆ విద్యార్థిని చంపించేవాడు. అవును ఏకంగా చంపించడమే! గడ్డిపరకల్ని తెంపేసినట్లు చంపేవాళ్ళు!

అలాంటి మంత్రికొడుకు పరీక్ష రాస్తున్న హాలులోకి నేను, శ్యామసుందరం సిట్టింగ్ స్క్వాడ్‌గా వెళ్ళాం. పులుల్లా వెళ్ళాల్సినవాళ్ళం పిల్లుల్లా ఆ హాలులో అడుగుపెట్టామని వేరే చెప్పనక్కరలేదు.

ఆహాలులో మంత్రిగారి కొడుకు పరీక్ష రాస్తున్న విషయం మాకు ముందే తెలిసింది.

అందుకే మా మిత్రులు జాలిగా మావంక చూశారు. పరీక్షహాల్లో చూసి చూడనట్లు ఊరుకోండి మనకేం అని సలహా ఇచ్చారు.

మాకు లోపల భయంగానే ఉంది. కాని పైకి మేకపోతు గాంభీర్యం వహించాం.

ఆ హాలులో మాకు అర్థమైన విషయం మంత్రిగారి కొడుకు పరీక్ష రాయడం లేదు, రాయిస్తున్నాడు. అందరూ సజావుగా కాపీలు చేసుకోడానికి కాపలాదారుగా

కూర్చున్నాడు. తాపీగా సిగరెట్టు కాలుస్తూ అప్పుడప్పుడు ముందున్న అమ్మాయి వీపును తాకుతున్నాడు.

ఆ అమ్మాయి నిస్సహాయంగా చూసింది. మయసభలోని ద్రౌపది అలాగే చూసిందేమో కానీ కృష్ణుడులాంటి మహాత్ము డెక్కడ !

దుర్యోధనుల, దుశ్శాసనుల కార్యకలాపాలు యధేచ్ఛగా సాగిపోతున్నాయి.

మా శ్యామసుందరం కొంచెం లౌక్యం తెలిసినవాడు. మంత్రికొడుకు ఆ అమ్మాయిని హింసిస్తుంటే చూస్తూ ఊర్కోవడం పాపం కనుక అటు చూడటం మానేసి ఆ హాలులో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు వారిలో ఎంతమందికి పొడుగుచేతుల చొక్కాలున్నాయి. ఎంతమందికి పొట్టిచేతుల చొక్కాలున్నాయి లాంటి స్టాటిస్టికల్ సర్వేలో నిమగ్నమయ్యాడు.

నేను అటు చూడకుండా ఉండలేకపోతున్నాను. ఆ అమ్మాయి నా చెల్లెలో, కూతురో అయితే పరీక్షహాల్లోనేం ఖర్మ ! రాష్ట్రానికి ఆ మాటకొస్తే దేశానికే నువ్వు హీరోవి పాపం ఆ అమ్మాయి జోలికిపోకు బాబూ అని గడ్డంపుచ్చుకొని ఆ మంత్రి కొడుకును బతిమిలాడుదాం అనుకున్నాను.

ఇంతకు ఆ మంత్రికొడుకు సిగరెట్లు కాలుస్తూ పరీక్షల్లో కాపీ చేయిస్తున్నాడు అని చెప్పానా మరి అతగాడి పరీక్ష ఎవరు రాస్తున్నారు అనుకున్నారు? మీరు నమ్ముతారో లేదో కాని ఆ కాలేజీలో ఒక సీనియర్ లెక్చరర్ మంత్రి కొడుకు ఆన్సర్ బుక్ నింపుతున్నాడు.

ఇవన్నీ మేం చూస్తూ చూడనట్లు ఊరుకున్నాం. గాంధీ అంతటి మహాత్ముడే "చెడుచూడకు" అన్నాడుకదా అది మాకు అనుకూలంగా ఉంది కనుక ఆ గాంధీ సూత్రాన్ని పాటించాం.

ముందున్న అమ్మాయి వీపు తాకడంతో తృప్తిపడలేదు మంత్రికొడుకు. సిగరెట్‌తో ఆ అమ్మాయి వీపుమీద చురక అంటిస్తుంటే చూస్తూ ఊర్కోలేకపోయాను.

కృష్ణుడు, రాముడు మొదలయిన దేవత లందరినీ తలచుకొని గుబగుబ కొట్టుకుంటున్న గుండెను అదుపులోపెట్టుకుంటూ ఆ మంత్రికొడుకు దగ్గరకి వెళ్ళి.

"ఆ అమ్మాయిని డిస్టర్బ్‌చేయకు బాబూ" అని ఎంత దీనంగా వేడుకోవాలో అంత దీనంగా వేడుకున్నాను. నాపై అధికారినిగాని, మా అల్లుడినికాని ఏ విషయంలోనూ అంతదీనంగా వేడుకోలేదు నేను. సరిగ్గా ఆ వాక్యమే అన్నాను. ఎంతో దీనంగా "ఆ అమ్మాయిని డిస్టర్బ్ చేయకు బాబూ" అని.

దానికే మండిపడ్డాడు ఆ మంత్రికొడుకు.

"మైండ్ యువర్ బిజినెస్" అంటూ నా కాలర్ పట్టుకున్నంత పని చేశాడు.

నా బిజినెస్‌నే కనుక నేను మైండ్‌చేస్తే వాడి చెవి మెలేసి పరీక్షహాలు బయటికి పంపించవచ్చు. కాని పంతుళ్లు, అమాయకులు. అమ్మాయిలు నోరుమెదిపే

కాలమా అది ! నేను నీళ్ళు దిగమింగి బేలగా ఎవరన్నా సహాయాని కొస్తారేమోనని అటు ఇటు చూశాను.

ఆ హాలులో ఉన్న నలుగురు లెక్చరర్లు నాలుగు దిక్కులుచూస్తూ నిలుచున్నారు. మా శ్యామసుందరం చూడటానికి మరో దిక్కులేదు కనుక నా దగ్గరి కొచ్చి అక్కణ్నుంచి బయటకి తీసుకపోయే ప్రయత్నం చేశాడు.

కనీసం ఆ అమ్మాయి సీటైనా మారుద్దామని ఆమెను లెమ్మన్నాను.

ఆ మంత్రికొడుకు అమ్మాయి భుజంమీద చేయివేసి "కూర్చో సిట్‌డౌన్" అని గద్దించాడు.

గుడ్లనిండా నీళ్ళు కుక్కుకుని కూర్చుంది ఆ అమ్మాయి.

వంచిన తల ఎత్తకుండా పరీక్ష రాయసాగింది.

"చూడవోయ్ ! ఈ హాలులో ఎంతమంది విద్యార్థులున్నారో తెలుసా?" నా రెక్కపట్టి పక్కకు ఈడ్చుకుపోతూ అన్నాడు శ్యామసుందరం.

నేను మాట్లాడలేదు.

తిరిగి తానే అన్నాడు.

"నూట రెండుమంది ఉన్నారు."

నేను వింటూ తల వంచుకున్నాను, గాలికి ఊగే గడ్డిపూలను చూస్తున్నాను.

"గమ్మత్తు ఏమిటో తెలుసా అందులో అరవయి ఎనిమిదిమంది విద్యార్థులు చేతులకు పొడుగు చేతుల చొక్కాలయితే అందులో సగం ముప్పయి నాలుగు మందికి పొట్టిచేతుల చొక్కాలున్నాయి. నలుగురు లెక్చరర్లు మనం ఇద్దరం మొత్తం ఆరుగురం లెక్చరర్లమా ! ఇందులో నలుగురికి పొడుగు చేతులయితే అందులో సగం ఇద్దరికి పొట్టిచేతుల చొక్కాలున్నాయి అన్నాడు.

శ్యామసుందరం మొహంలోకి ఒకసారి చూసి

"ఆ మంత్రికొడుకు కుడిచేతికి ఆరువేళ్ళున్నాయి. వాడి నోట్లో ఇరవయి ఎనిమిది పళ్ళున్నాయి" అన్నాను.

విత్తరపోయి నావంక చూశాడు శ్యామసుందరం.

"అలా చూస్తావేం?" అని అడిగాను.

"నీగల్లా పట్టుకున్నప్పుడు వాడి చేతికి ఆరువేళ్ళు ఉన్న విషయం పసిగట్టావు అనుకుంటాను కాని వాడి నోట్లో ఇరువయి ఎనిమిది పళ్ళున్న విషయం ఎట్లా తెలిసింది?

"ఆ అమ్మాయి బెదురుచూపులు చూసినపుడల్లా వాడు వికటాట్టహాసం చేస్తున్నాడు కదా అలా నోరు తెరిచినపుడు వాడికింది దవడను పై దవడను గమనించాను. దగ్గరే నించున్నానుకదా ఆ దవడల చివరనున్న గ్యాప్‌నుబట్టి వాడికి ఇరవయి ఎనిమిది పళ్లున్నట్లు ఊహించాను.

అసలు విషయాల్ని వొదిలేసి అలా అనవసరపు స్టాటిస్టికల్ విషయాలు చర్చించుకున్నాం. క్లాసుల్లో కూడా అలాంటి పనులే చేయడానికి అలవాటుపడ్డాం కనుక మా ప్రవర్తన మాకు వింతగా అనిపించదు.

* * *

ఆరోజు పరీక్ష అయింది. అది మాకు పరీక్ష దెబ్బలేవీ తగలకుండా ఉన్న అవయవాలు ఉన్నట్లుగా పరీక్షహాలు నుంచి బయటపడటం ఆరోజుల్లో పరీక్షే.

శ్యామసుందరం, నేను బస్‌స్టాప్‌కేసి నడుస్తున్నాం. మా కిద్దరికీ సొంత వాహనాల్లేవు.

రోడ్డంతా వొదిలి రయ్‌న మా పక్కనుంచే ఒక కారు దూసుకుపోయింది.

శ్యామసుందరం ఒడుపుగా నన్ను చేయిపట్టి పక్కకులాగకపోతే వికలాంగుల లిస్టులో చేరిఉండేవాణ్ణి లేదా మా కాలేజీకి ఒకరోజు హాలిడే ఇచ్చేవారు.

"ఆ కారులో పోతున్నవాడు మంత్రికొడుకు" అన్నాడు శ్యామసుందరం.

"వాడు గంటకు ఎనభై మైళ్ళ వేగంతో కారు తోలుతున్నాడు. వాడు మన దుస్తులమీద చల్లించిన మరకల సంఖ్య ముప్పై ఆరు" అన్నాను.

"ముప్పై ఆరు, ముప్పై ఆరు" అని కాసేపు గొణిగి.

"మనకు స్వాతంత్ర్యం వచ్చి ముప్పైఆరు సంవత్సరాలయింది. స్వాతంత్ర్యం వచ్చాక మనం దేశాన్ని పట్టించుకోవడం మానేశామోయ్" అన్నాడు శ్యామసుందరం.

మంత్రికొడుకు మా దుస్తులమీద చల్లించిన బురద మరకల్ని చూస్తున్నాను.

నిస్సహాయంగా అలా చూడటం తప్ప చేసేదేముంది?

* * *

"నువ్వు చెప్పింది నిజమేనోయ్, వాడికి ఇరవయి ఎనిమిది పళ్ళే ఉన్నాయి" అన్నాడు శ్యామసుందరం నాకు దగ్గరగా వచ్చి.

నేను ఆలోచనలనుండి తేరుకొని అతనివంక చూశాను.

"వాడేనోయ్ ఫలానా మాజీ మంత్రి కొడుకు ఆ రోజు మన దుస్తులమీద బురద మరకలు చిందించేవాడు. అప్పుడు వాళ్ళతండ్రి మంత్రిగారు మరి."

ఇప్పుడు ఆ అట్టహాసం లేదు. వాడి తండ్రికి మంత్రిపదవి లేదు. కనీసం మామూలు ఎం.ఎల్.ఏ. కూడా కాదు.

"వాడికి నువ్వు ఊహించినట్లుగా ఇరవయి పళ్ళే ఉన్నాయి" అన్నాడు శ్యామసుందరం మళ్ళీ.

"ఆ విషయం ఇంతకాలం తర్వాత నిజమని తెలిసిందా నీకు? వాడికి ఎన్ని పళ్ళుంటే మనకేం, ఊడితే మనకేం" అన్నాను.

"మా బావమరిది డెంటల్ డాక్టరు కదా? అతడు చెప్పాడు ఫలానా మాజీ మంత్రికొడుకు మా హాస్పిటల్‌లో అడ్మిటయ్యాడు. అతనికున్న ఇరవయి ఎనిమిది పళ్ళల్లో ముందుపళ్లు నాలుగు విరిగిపోయాయి అని."

"అలాగా! ఎలా విరిగాయట?"

"ఎవరో అమ్మాయిని అల్లరి పెట్టబోయాడట! సిసింద్రీలా లేచి కరాటే ఫైట్ చేసి ఆ అమ్మాయి వాడిపళ్ళు విరగ్గొట్టిందట."

"అదీ ఎవ్రీ డాగ్ హేజ్ ఇట్స్ ఓన్‌టైం అని ఊరికే అన్నారా? ధనం, అధికార గర్వంతో విర్రవీగే వాళ్ళను, తమ పశుబలంతో ప్రజల్ని పీడించేవాళ్ళను, ఆ ప్రజలే ఒక రోజు శిక్షిస్తారు. వారికి తగిన గుణపాఠం నేర్పుతారు" అన్నాను ఉద్వేగంతో.

"ఆపు....ఆపు ..మనం జ్యోతిష్యం చెప్పడంకాదు ప్రజల్ని ఇంకా చైతన్యవంతుల్ని చేయడానికి మనవంతు పాత్ర ఏమిటో ఆలోచించి ధైర్యంగా నిర్వహించాలి" అన్నాడు శ్యామసుందరం.

అతనిలోని కొత్త రూపానికి నేను ఉత్తేజితుడ్ని అయ్యాను. మా సామాజిక బాధ్యత గురించి ఆలోచించసాగాను.

(మయూరి వీక్లీ – *28-11-1986*)